క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. స్థానిక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. శనివారం మునగపాకకు చెందిన సూరిశెట్టి ప్రసాద్–త్రివేణి దంపతులు రూ.30 వేలను కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. మునగపాకకు చెందిన ఆడారి సూరిబాబు రూ.5,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, బొడ్డేడ రామునాయుడు, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట ఉమేష్, ఆడారి కాశీబాబు, ఆడారి అప్పలనాయుడు, భీశెట్టి మాధవ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పెయ్యిలకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన ఆవు పెయ్యి

మునగపాక: మండల వ్యాప్తంగా ఆవు పెయ్యిలను లక్ష్యంగా చేసుకుని కుక్కలు రెచ్చిపోతున్నాయి. రాత్రుళ్లు పొలాల్లోని పాకల వద్ద ఉన్న పెయ్యిలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పాటిపల్లికి చెందిన భీశెట్టి శ్రీనివాసరావుకు చెందిన ఆవుపెయ్యిని శుక్రవారం రాత్రి కుక్కలు గాయాల పాలుచేశాయి. చెవిని కొరికేసినట్లు రైతు వాపోయాడు. కుక్కలు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు



మోటారుకు మరమ్మతు చేసి భూమికిలోకి దించుతున్న పంచాయతీ సిబ్బంది

కోటవురట్ల: కె.వెంకటాపురం ఎస్సీ కాలనీలోని రక్షితనీటి పథకం మోటారు మరమ్మతుకు గురికావడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇంది రభవానీ చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీలోని 10 వేల లీటర్ల మంచినీటి సామర్థ్యం కలిగిన రక్షితనీటి పథకానికి సంబంధించి సబ్‌మెర్సిబుల్ మోటారు శుక్రవారం కాలిపోయింది. శనివారం స్థానికులు సర్పంచ్‌కు ఫిర్యాదు చేయడంతో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా మోటారుకు మరమ్మతు చేయించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పైల నాని పనులను పర్యవేక్షించారు.

అటెన్షన్ ప్లీజ్...



ఉమ్మలాడ దోమలకు నిలయంగా మురుగునీటి కాలువ

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో మురుగునీటి కాలువ అధ్వానంగా ఉంది. ప్రాథమిక పాఠశాలకు సమీపంలో మురుగునీరు కాలువ పరిస్థితి మరీ దారుణం. కాలువలో షిల్టు పేరుకుపోతోంది. దీంతో దోమలకు నిలయంగా మారింది. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల ఆక్రమణ

వాహన చోదకులకు ఇక్కట్లు



పాయకరావుపేట నుంచి పెంటకోట వెళ్లే ఆర్అండ్‌బీ



లింగాలకాలనీ వద్ద ఆక్రమణలకు గురవుతున్న ఆర్అండ్‌బీ రోడ్డు

పాయకరావుపేట: మండలంలో పలు రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు సాగించి షెడ్లు, పాకలు, పాన్‌షాపులు నెలకొల్పడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గ, మండల ప్రధాన కేంద్రం పాయకరావుపేట నుంచి పెంటకోట తీర ప్రాంతానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గురవుతోంది.

పాయకరావుపేట నుంచి పెంటకోట తీర ప్రాంతం వరకు 15 కిలోమీటర్ల మేర పొడవు రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాల మీదుగా తీర ప్రాంతాలకు ఇదే ప్రధాన మార్గం. కానీ పాయకరావుపేట పట్టణంలో రోడ్డు ప్రారంభ ముఖ ద్వారం నుంచి దానికి ఇరువైపులా బడ్డీకొట్టులు ఏర్పాటు చేయడంతో ఆటోలు, రిక్షాలు, ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా అరట్లకోట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాల్లో రోడ్లు ఆక్రమణలకు గురై కుచించుకుపోతున్నాయి. పట్టణంలో నాగరాజుపేట మీదుగా లింగాల కాలనీ, నర్సీపట్నం వెళ్లే రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురికావడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండవ నది ఒడ్డున పెద్ద షెడ్లు, దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా తుని నుంచి శ్రీరాంపురం మీదుగా రాజవరం వరకు వెళ్లే రోడ్డు అక్కడక్కడ ఆక్రమణలకు గురికావడం వల్ల కంపెనీలకు చెందిన వాహనాలు కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం గ్రామాల వద్ద రోడ్డు ఆక్రమణలకు గురవుతోంది. ఆర్అండ్‌బీ రహదారులు ఆక్రమణలకు గురికావడం వల్ల తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆర్అండ్‌బీ రోడ్లు ఆక్రమణలకు గురికాకుండా, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎగ్‌స్ట్రా అయినా తప్పదు మరి..

కొండెక్కిన కోడిగుడ్డు ధర



కోడిగుడ్లు ట్రేలు

కోటవురట్ల: సామాన్యుడి వంట నేస్తం కోడిగుడ్డు కొండెక్కింది. వారం కాదు, పక్షం కాదు ఏకంగా నెల రోజులుగా పైకి ఎగబాకి కిందికి దిగిరానంటోంది. నాకూ రోజులొచ్చాయంటూ భీష్మించుకుని కూర్చుంది. ఏం.. కంది పప్పు, వంట నూనెల కంటే నేనేమైనా తీసిపోయానా అంటోంది. నా స్థాయిని దిగజార్చుకోనంటూ గుడ్డు ప్రియులను బెదిరిస్తోంది. సామాన్యుడి నుంచి ధనికుడి ఇంట్లో వరకు ఎప్పుడూ సిద్ధంగా ఉండే వంటకం కోడి గుడ్డే. అనుకోని అతిథి వచ్చినా, కూరగాయలు సిద్ధంగా లేకపోయినా కోడి గుడ్డు పగలాల్సిందే. అటువంటి కోడిగుడ్డు ఇప్పుడు భారంగా మారింది. గతంలో రూ.5 ఉండే కోడి గుడ్డు ధర ఇప్పుడు రూ.7కు వెళ్లి అక్కడే తిష్ట వేసింది. కిరాణా దుకాణాలలో రూ.7 ఉంటే ఇక సూపర్ మార్కెట్లో రూ.8, మాల్స్‌లో రూ.10 పలుకుతూ బెంబేలెత్తిస్తోంది.

అందరి నేస్తం..

కోడి గుడ్డు అంటే పిల్లల నుంచి వ్యాయామం చేసేవారి వరకు ఇష్టపడి తినేవారే. పౌష్టికాహారం కావడంతో ఎక్కువగా జిమ్‌కి వెళ్లేవారు డైట్‌లో భాగంగా ఉడకబెట్టిన కోడిగుడ్డును రోజూ తీసుకుంటారు. ఇక బిర్యానీలో అయితే గుడ్డు లేకుండా తినాలంటే ఆ కిక్కే ఉండదు. అన్నింటా తానైనా కోడి గుడ్డు ప్రస్తుతం ప్రియమైంది. గతంలో గుడ్డు ట్రే ధర రూ.150 నుంచి రూ.160 ఉండగా, ప్రస్తుతం రూ.200 పలుకుతోంది. ధర నెల రోజులుగా పెరిగి తగ్గకపోవడంతో ట్రే లెక్కన కొనుక్కునేవారు విడిగా 6 గుడ్లు చొప్పున ఏ రోజుకారోజు కొనుక్కుంటున్నారు. నిత్యావసర ధరలతో పాటు కోడి గుడ్డు ధర కూడా బాగా పెరగడంతో సామాన్యుడు ఆవేదన చెందుతున్నాడు. ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ధరల అదుపులో చొరవ చూపడం లేదని ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీ గుడ్డు పక్కదారి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంగా ఉడకబెట్టిన కోడిగుడ్డును పిల్లలకు ఇస్తారు. గర్భిణులకు గుడ్లు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం గుడ్డు ధర బాగా పెరగడంతో డిమాండ్ కూడా అదే స్థాయిలో పెరిగింది. దాంతో అంగన్‌వాడీ గుడ్లు పక్కదారి పట్టి బయట మార్కెట్‌కు చేరుతున్నాయి. పలు దుకాణాల్లో అంగన్‌వాడీ గుడ్లను బహిరంగంగానే విక్రయిస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా కోడిగుడ్డుకూ ఓ రోజు కాదు కాదు.. ఏకంగా రోజులే వచ్చాయని చెప్పక తప్పదు.

మహనీయుల విగ్రహాలపై దాడులు పట్టవా?

లింగరాజుపాలెంలో కొవ్వొత్తుల ప్రదర్శన



లింగరాజుపాలెంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: మహనీయుల విగ్రహాలపై దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారని సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 31న రాత్రి లింగరాజుపాలెంలో స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గ్రామస్తులు, సీపీఎం నాయకులు కలిసి శనివారం రాత్రి కొవ్వొత్తులు ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. సంఘటన జరిగి 12 రోజులు గడుస్తున్నా నేటికీ నిందితులను పట్టుకోలేదన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. గణపతిరాజు, ఎం.రాజేష్, సీతారామరాజు, సాంబమూర్తిరాజు, సన్యాసిరాజు, అప్పలనరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'కేరింతలు'



సంప్రదాయ వస్త్రధారణతో గీతాలు ఆలపిస్తున్న బాలలు



పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో బాల ఉద్యానవనం నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు శనివారం నిర్వహించిన కేరింతలు కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ సమన్వయకర్త ఓలేటి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఆశలు, ఆకాంక్షలు కలిగి వుండాలని, ఆనందంగా జీవితం గడపాలని అయితే అవసరమైనప్పుడు దేశం కోసం త్యాగం చేసే ధైర్యం కూడా కలిగి వుండాలని సూచించారు. స్వామి వివేకానంద చెప్పినట్లు విద్యార్థులు సింహం లాంటి గుండె ధైర్యం, సాహసం కలిగి వుండాలని అటువంటి వారిని మాత్రమే విజయం వరిస్తుందని ఆయన అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకు మాత్రమే పరిమితం అయితే వారికి ఒత్తిడి పెరిగి మానసిక సంఘర్షణకు లోనవుతారని, ఆటపాటలతో కూడిన విద్యా బోధన వారికి మరింత ఉత్సాహం, ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. ఈ కార్యక్రమం సంక్రాంతి సంబరాలతో ప్రారంభమై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిసింది. విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి అజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు, వివిధ శాఖల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగిస్తున్న వేల్పులవీధి మహిళలు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం జరిగింది. మహిళలు వివిధ రకాల పిండి వంటకాలు తయారు చేసి అమ్మవారి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పెరుగుబజార్, చిన్నవీధి, తాకాశీవీధి, గాంధీబొమ్మ జంక్షన్, బీమునిగుమ్మం, రైల్వే స్టేషన్, రామచంద్ర థియేటర్, నెహ్రూచౌక్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవ కమిటీ పోస్టర్ ఆవిష్కరణ....

స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవం ఈ నెల 18న అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వాకాడ బాబు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు భీమరశెట్టి రాంకీ అమ్మవారి కరపత్రాలను ఆవిష్కరించారు. వేల్పులవీధి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'కూడార్రై' ఉత్సవం



ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాయసం పంపిణీ

కశింకోట: దేవాలయాల్లో శుక్రవారం 'కూడార్రై' ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారిని పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. గోదాదేవి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా రెండు రకాల పాయసాన్ని నెయ్యి, డ్రైఫ్రూట్స్‌తో పెద్ద అండాలతో తయారు చేయించి స్వామికి నివేదించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన వంట శాలను ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతిల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించారు.

14న జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

మునగపాక: ఈనెల 14న మునగపాకలో నిర్వహించే జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు, గుర్రపు పరుగు పోటీలకు సంబంధించి శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. జనసేన నాయకుడు సుందరపు సతీష్‌కుమార్ మాట్లాడుతూ మునగపాక బైపాస్ రోడ్డులో 14న మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి అప్పలనాయుడు, వేగి కృష్ణ, విల్లూరి నూకనరసింగరావు, పెంటకోట శ్రీరామమూర్తి, కేపీ రావు, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక దృక్పథం అవసరం



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దృక్పథం కలిగి ఉండాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దుప్పుతూరులో నిర్వహించిన ధనుర్మాస వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ముందుకు వెళ్లాలని కోరారు. ముందుగా భక్తులకు దుస్తులు పంపిణీ చేశారు.

క్రీడల్లో యువతకు ప్రోత్సాహం



హోరాహోరీగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎస్.రాయవరం: యువత క్రీడల్లో రాణించడానికి ప్రోత్సాహం ఎంతో అవసరమని పీఆర్టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు 21 టీమ్‌లు వచ్చాయి. ఇందులో ప్రథమ బహుమతి రూ 10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందజేశారు.

ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారిగా నాగ అనూష



నాగ అనూషకు బాధ్యతలు అప్పగిస్తున్న ఇన్‌చార్జి వైద్యాధికారి శిరీష

కశింకోట: కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారిగా కె. నాగఅనూష శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న డాక్టర్ టి. శిరీష ఆమెకు బాధ్యతలు అప్పగించారు. శిరీషను అచ్యుతాపురం మండలం హరిపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి బదిలీ చేశారు.

కత్తికోడి పందేలు నిషేధించాలని వినతి



డీఎస్పీ శ్రావణికి వినతిపత్రం అందజేస్తున్న బొట్టా చిన్నియాదవ్

అనకాపల్లి: పండగ వేళలో కత్తికోడి పందేలకు అడ్డుకట్ట వేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రావణికి శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. కత్తికోడి పందేలు కారణంగా పండగల్లో లక్షలాది వ్యాపారాలు లావాదేవీలు జరుగుతున్నాయని, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు సూది కొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో నిర్వహించిన డావెన్సీ ఉత్సవ్ ముగింపులో భాగంగా శనివారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, హెచ్‌ఎం మిశ్రాతో పాటు ఉపాధ్యాయులు, పలువురు తల్లితండ్రులు పాల్గొన్నారు. ముందుగా గవర్ల అనకాపల్లికి చెందిన పొలమరశెట్టి మురళి ఏర్పాటు చేసిన సోలార్ వెలుగులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మునగపాక: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు, గోకులం షెడ్లను ప్రారంభించారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఉపాధి ఏపీవో శివ, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎంవో అశోక్‌కుమార్, వైద్యుడు లక్ష్మణ శ్రీనివాసరావు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌ఎంవో అశోక్‌కుమార్, జనరల్ ఫిజీషియన్ లక్ష్మణశ్రీనివాసరావు ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి పెద్దాడ అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలు, 12వ పీఆర్సీ కమిటీ వేసి, తాత్కాలిక భృతి 36 శాతం చెల్లించాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎస్ఐ బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 100 శాతం వేతనం చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ, యూనియన్ జిల్లా నాయకులు ఎం.తిరుమలరావు, కోరుప్రోలు సత్యనారాయణ, నంది కోళ్ల దివాకర్, కాళ్ల విష్ణు, ఎస్.సంతోష్ పాల్గొన్నారు.

పోస్టుఫీసు సిబ్బందికి సంక్రాంతి పోటీలు

మాడుగుల రూరల్ : సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా, కె.జె.పురం సబ్ పోస్టుఫీసు పరిధిలో గల సిబ్బంది శనివారం సాయంత్రం నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొన్నారు. కె.జె.పురం సబ్ పోస్టుమాస్టర్ కె.సుధీర్ ఆధ్వర్యంలో, బ్రాంచి పరిధిలో గల 13 బ్రాంచి పోస్టుఫీసుల్లో పనిచేస్తున్న సిబ్బందికి కబడ్డీ, కుర్చీ ఆట, అంత్యాక్షరి, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి రాంజీ పాల్గొన్నారు.

వివేకానంద జయంతి వేడుకలు నేడు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడకలో ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చోడపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్ ఆవిష్కరించారు. పూడిమడక–కడపాలెం అమ్మవారి సతకంపట్టు వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యువతీ యువకులు పాల్గొనాలని కోరారు.